# డంపింగ్ యార్డు ఏర్పాటు వద్దు

**నూతనంగా ఏర్పాటైన పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు**



నల్లవల్లిలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా తీర్మాణం చేస్తున్న సమితి సభ్యులు

గుమ్మడిదల, అక్టోబర్ 6: మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ఫార్యానగర్ అటవీ ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయవద్దని గ్రామస్తులు శనివారం పర్యావరణ పరిరక్షణ సమితిని ఏర్పాటు చేశారు. డంపింగ్‌యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తీర్మానం చేశారు. ఉమ్మడి రాష్ట్రం సీఎం కిరణకుమార్‌రెడ్డి హయాంలో 2013లో డంపింగ్‌యార్డుకు బీజం పడిన విషయం తెలిసిందే. స్వరాష్ట్రంలో డంపింగ్‌యార్డు ఏర్పాటును మండల నాయకులతో అడ్డుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులో డంపింగ్‌యార్డు ప్రయత్నాలు కొనసాగుతుండడంతో జీహెచ్‌ఎంసీ హైదరాబాద్‌కు సంబంధించిన చెత్తను వేయడానికి మండలంలోని నల్లవల్లి ఫార్యానగర్ అటవీ ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయవద్దని నల్లవల్లి, ఫార్యానగర్ గ్రామస్తులు పర్యావరణ పరిరక్షణ సమితిని ఏర్పాటు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ డంపింగ్‌యార్డును ఏర్పాటు చెయవద్దని తీర్మానించారు.

## ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సిర్గాపూర్, అక్టోబర్ 6: సిర్గాపూర్ మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల గురుకులం పాఠశాల, కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయ, అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమలత ఆదివారం ప్రకటనలో తెలిపారు. స్థానికంగా నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇందులో జేఎల్ జంతు శాస్త్రం, పీజీటీ తెలుగు, పీజీటీ, మ్యాథ్స్, పీజీటీ సైన్స్ టీచర్ల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థుల ఈనెల 21న ఆర్‌సీవో కార్యాలయంలో జరిగే డెమో, ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్(83339 25391)ను సంప్రదించాలని సూచించారు.



గుంతలమయంగా మారిన గుమ్మడిదల – కానుకుంట సింగిల్ రోడ్డు

# బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడో!

- గుంతలమయంగా కానుకుంట రహదారి
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు

గుమ్మడిదల, అక్టోబర్ 6: మండల కేంద్రమైన గుమ్మడిదల చౌరస్తా నుంచి కానుకుంట గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి నరకాన్ని తలపిస్తున్నది. ఐదు కిలోమీటర్ల ఈ రోడ్డు మీదుగా మేడ్చల్, హైదరాబాద్‌కు చేరుకోవచ్చు. మేడ్చల్.. హైదరాబాద్, గజ్వేల్, తూప్రాన్ జాతీయ రహదారికి చేరుకోవచ్చు. నేడు ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈదారి మీదుగా భారీ వాహనం వస్తే చిన్న వాహనాలు రోడ్డు దిగి పక్కకు వెళ్లాల్సిన పరిస్థితి. ప్రస్తుతం పడుతున్న వర్షాలతో రోడ్డంతా బురదమయంగా మారుతున్నదని రైతులు, కూలీలు వాపోతున్నారు.

**రూ.1.48 కోట్లు వెనక్కు వెళ్లాయా?**

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ రహదారికి రీ బీటీ వేయడానికి రూ.కోటీ 48 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధుల మంజూరుతోపాటు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తన సొంత నిధులతో సుమారు ఏడు, ఎనిమిది కోట్లు వెచ్చించి డబుల్ రోడ్డుగా మార్చడానికి పనులు ప్రారంభించారు. తీరా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఈ పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వాలు మారాయి. కానీ, పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. దీంతో ఈ వానకాలం సిజన్‌లో మరమ్మతులకు నోచుకోకుండా రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు వెనక్కు పోవడంతోనే పనులు నిలిచిపోయాయని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం ఇచ్చే సొంత నిధులు ఆగిపోవడంతో గుమ్మడిదల–కానుకుంట రోడ్డుకు మోక్షం ఇక ఇప్పట్లో లేనట్లేనా అని మండల ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా కానుకుంట రోడ్డును డబుల్ రోడ్డుగా ఆధునీకరించడానికి కాంగ్రెస్ సర్కారు శ్రీకారం చుట్టాలని కోరుతున్నారు.

# అలయ్‌బలయ్ నిర్వహణకు స్థల పరిశీలన



అలయ్‌బలయ్ నిర్వహణకు స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి, అక్టోబర్ 6: దసరాను పురస్కరించుకొని సోమవారం వట్‌పల్లి మండల కేంద్రంలోని వెంకఖ్వాజా ఫంక్షన్ హాల్‌లో అలయ్‌బలయ్ కార్యక్రమం నిర్వహించేందుకు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నా, లేకున్నా నమ్ముకున్న ప్రజలు, పార్టీ కార్యకర్తలను కలవడానికి అలయ్‌బలయ్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు వరం వీరారెడ్డి, మాజీ ఎంపీటీసీలు శివాజీరావు, నర్సింహులు, నాయకులు బుద్ధిరెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న 'ఓపెన్' పరీక్షలు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 6: జిల్లాలోని ఓపెన్ స్కూల్ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ఆదివారం నాలుగో రోజు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ కామర్స్, బిజినెస్ స్టడీస్ పరీక్షకు మొత్తం 248 మంది అభ్యాసకులకు 193 మంది హాజరయ్యారు. 55 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. దీంతో 78 హాజరు శాతం నమోదైంది. ఎస్‌ఎస్‌సీ సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్షకు 120 మంది అభ్యాసకులకు 91 మంది హాజరు కాగా, 29 మంది అభ్యాసకులు హాజరయ్యారు. 7 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియట్ ఫిజిక్స్ పరీక్షకు మొత్తం 35 మంది అభ్యాసకులకు 29 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. దీంతో 91 హాజరు శాతం నమోదైంది. ఎస్‌ఎస్‌సీ హిందీ పరీక్షకు 16 మంది అభ్యాసకులు హాజరు కావాల్సి ఉండగా 11 మంది హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ పరీక్షల కమిటీ ఆయా పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

# సంఘటిత శక్తి నిర్మాణానికి ఆర్‌ఎస్‌ఎస్ కృషి

రామచంద్రాపురం, అక్టోబర్ 6: సమాజంలో సంఘటిత శక్తి నిర్మాణానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) కృషి చేస్తున్నదని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సేవా ప్రముఖ్ యోగిశెట్టి హనుమంతరావు అన్నారు. అక్టోబర్ 10న జరుగబోయే ఆర్‌ఎస్‌ఎస్ వంద సంవత్సరాల వేడుకలకు సంబంధించి ఆదివారం విద్యుత్‌నగర్ కాలనీలోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో ఆర్‌ఎస్‌ఎస్ సేవకులు 200మంది అభ్యాస వర్గ చేశారు. 10న ఆర్సీపురంలోని శ్రీకన్వెన్షన్ హాల్ నుంచి ఆర్సీపురం, బీరంగూడ, పటాన్‌చెరు వరకు సుమారు వెయ్యి మంది ఆర్‌ఎస్‌ఎస్ సేవకులతో మార్చ్ నిర్వహిస్తామని తెలిపారు.



రామచంద్రాపురం: అభ్యాస వర్గ చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సేవకులు



కోహీర్: దిగ్వాల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో యువకులు

*ప్రతి ఒక్కరూ దేశ భక్తితో మెలగాలి*

కోహీర్, అక్టోబర్ 6: ప్రతిఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర గోసేవ ప్రముఖ్ వెంకట్‌నివాస్ కోరారు. ఆదివారం మండలంలోని దిగ్వాల్ గ్రామ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకలను పురస్కరించుకొని పథ సంచాలన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సేవయే ప్రథమ కర్తవ్యంగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. వేడుకల్లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రముకులు పాల్గొన్నారు.

## కమనీయం.. వేంకటేశ్వరుడి కల్యాణం



వేంకటేశ్వరుడి కల్యాణ తంతు జరిపిస్తున్న వేదపండితులు

గుమ్మడిదల, అక్టోబర్ 6: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుడి కల్యాణోత్సవాన్ని వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రమైన గుమ్మడిదలలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణ వేదికపై శ్రీదేవిభూదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుడి ఉత్సవమూర్తులను వివిధరకాల పూలదండలతో అందంగా అలంకరించారు. ఆలయ వంశపారంపర్యకులు కేవీ నర్సింహాచార్యులు, కేవీ రంగనాథచార్యులు, అచ్చుతచార్యులు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి శ్రీవారిని గజవాహనసేవలో ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కల్యాణోత్సవానికి మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, ధర్మకర్తలు దేవేందర్‌రెడ్డి, చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, సూర్యనారాయణ, పుట్ట నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ ప్రమాదకరం

మునిపల్లి, అక్టోంబర్ 6: వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపోద్దని మునిపల్లి ఎస్సై రాజేశ్‌నాయక్ సూచించారు. ఆదివారం మండలంలోని బుధేరా చౌరస్తాలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ కచ్చితంగా ధరించాలని, పెద్ద వాహనాలు నడిపించే సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు.

## బతుకమ్మ చీరల పంపిణీ మరిచారా?

జహీరాబాద్/కోహీర్, అక్టోబర్ 6: ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయడం కాంగ్రెస్ మరిచిపోయిందని న్యాల్‌కల్ మండలంలోని మల్గి మాజీ సర్పంచ్ మారుతి ఆరోపించారు. ఆదివారం బతుకమ్మ చీరల పంపిణీలో కాంగ్రెస్ నిర్లక్ష్యంపై ఓ ప్రకటనలో మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఆడబిడ్డలందరికీ బతుకమ్మ చీరలను అందించేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ మాత్రం అసలు ఆ విషయమే తీయడంలేదని ఆరోపించారు. తెలంగాణకు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటేనే రాష్ట్రం బాగుంటుందని అందరూ అభిప్రాయపడుతున్నారని చెప్పారు.

## రసాయన పొగతో ఉక్కిరిబిక్కిరి

జిన్నారం, అక్టోబర్ 6: గడ్డపోతారం పారిశ్రామివాడలోని రసాయన పరిశ్రమలు వదిలిన పొగతో గ్రామస్తులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శనివారం అర్ధరాత్రి పరిశ్రమల నుంచి ఘాటైన రసాయన పొగలు గ్రామాన్ని కమ్మేయడంతో శ్వాస తీసుకోలేక అవస్థలు పడ్డామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాన్ని రసాయన పొగలు కమ్మేసిన తీరును గ్రామస్తులు మొబైల్ ఫోన్‌లలో చిత్రీకరించారు. ఆదివారం ఉదయం పీసీబీ అధికారులకు పంపించారు. ఇంత దారుణమైన పరిస్థితులను గతంలో ఎప్పుడు అనుభవించలేదని వాపోయారు. రాత్రిళ్లు పీసీబీ అధికారులు నిఘా ఏర్పాటు చేసి తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

## వడ్డె ఓబన్నకు నివాళి



నివాళులర్పిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

రామచంద్రాపురం, అక్టోబర్ 6: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న 176వ జయంతి సందర్భంగా ఆదివారం ఆర్సీపురం డివిజన్‌లోని వడ్డెర బస్తీలో ఉమ్మడి మెదక్ జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు వరికుప్పల లింగయ్య ఆధ్వర్యంలో ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం, రాయలసీమ రైతుల హక్కుల కోసం బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారికి వ్యతిరేఖంగా పోరాడిన మహనీయుడు వడ్డె ఓబన్న అని గుర్తుచేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో పాడి గేదె మృతి

నిజాంపేట్, అక్టోబర్ 6: మేత కోసం వెళ్లిన బర్రె కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఘటన బాచెపల్లిలో చోటుచేసుకుంది. నిజాంపేట్ మండల పరిధిలోని బాచెపల్లి గ్రామానికి చెందిన పుట్టి సంగయ్యకు చెందిన గేదె శనివారం మేత కోసం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఊరి శివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగకు ప్రమాదవశాత్తు తగిలి మృతి చెందింది. ప్రభుత్వం బాధిత రైతు పుట్టి సంగమేశ్‌కు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



బతుకమ్మ వేడుకల్లో చైర్ పర్సన్ రోజాబాల్‌రెడ్డి

## అంబరాన్నంటిన బతుకమ్మ వేడుక

బొల్లారం, అక్టోబర్ 6: మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్న బస్తీకి చెందిన టీం విశ్వనేత్ర యూత్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సంబురాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని బతుకమ్మ ఆడారు. మహిళలు మూడంతరాల్లో చామంతి, మందార, సీతమ్మ జడ, రామబాణం పూలతో బతుకమ్మను తయారుచేసి ఉత్సాహంగా ఆడి పాడారు. అనంతరం పాలు బెల్లం నైవేధ్యంగా గౌరమ్మకు సమర్పించారు. ఆపై ప్రసాదాన్ని ఒకరికొకరు పంచుకున్నారు. బతుకమ్మను పూజించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

## బాధిత కుటుంబాలకు చేయూత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు ఇస్తున్న అక్షయ పాత్ర ఫౌండేషన్ సభ్యులు

పుల్కల్, అక్టోబర్ 6: అక్షయ పాత్రలో విధులు నిర్వహించేందుకు జూలై 25న వెళ్తున్న ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఉమ్మడి మండల పరిధిలోని గొంగ్లూరు గ్రామానికి చెందిన చంటి పల్ల అభిషేక్, గంగోజిపేట గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కాశపాగ నవీన్, కాశపాగ సందీప్ కంది సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీ కొట్టి అక్కడికక్కడే మృతి చెందారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ వారు ఆదివారం బాధిత మూడు కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ఫౌండేషన్ యాజమానులు వినయ్, మధుసూదన్, కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ వెంకటేశం అందజేశారు. బాధిత కుటుంబాల తరపున యాజమాన్యంతో మాట్లాడి సహాయం అందించిన సంగారెడ్డి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య, బాబు జగజీవన్ రామ్, సమతా జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌కు భాదిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## దాతల సేవలు వెలకట్టలేనివి



పీచెర్యాగడి తండాలో పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్

కోహీర్, అక్టోబర్ 6: గిరిజనులకు సౌకర్యాలను కల్పించేందుకు దాత ముందుకు రావడం అభినందనీయమని మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని సజ్జాపూర్‌కు చెందిన ప్రసాద్‌రెడ్డి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పీచెర్యాగడి తండాలో రూ.5లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డ్రైనేజీ నిర్మాణంతో పాటు సొంత ఖర్చులతో అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాత ప్రసాద్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో రామలింగారెడ్డి, హర్షద్, ఎంజీ రాములు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## వేతన ఒప్పందంలో యాజమాన్యం నిర్లక్ష్యం



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కవేలి సెయింట్ గోబైన్ పరిశ్రమ కార్మికులు

కోహీర్, అక్టోబర్ 6: మండలంలోని కవేలి రాక్‌వూల్(సెయింట్ గోబైన్) పరిశ్రమ యాజమాన్యం తొమ్మిది నెలలుగా వేతన ఒప్పందం చేయడం లేదని పలు సంఘాల కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వేతన ఒప్పదం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం మొండి వైఖరి నశించాలని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే వేతన ఒప్పదం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులున్నారు.

## ఈ నెల 9లోగా దరఖాస్తు చేసుకోవాలి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 6: నూతన ఐటీఐ ట్రేడ్‌లలో ప్రవేశం కోసం 6వ దశ వాక్ ఇన్ అడ్మిషన్స్ జరుగుతుందని స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9లోగా http://iti.telanagana.gov.in లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే తొలి ఐదు దశల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మరోసారి దరఖాస్తు చేయనవసరం లేదన్నారు. కొత్తవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐలో జరిగే ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గుమ్మడిదల: శ్రీకామేశ్వరిదేవిగా భద్రకాళి


# భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రులు

*దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వాడవాడలా వెలిసిన మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగుతుండగా పలువురు ప్రముఖులు అమ్మవార్లను దర్శించుకున్నారు. నాలుగో రోజు ఆదివారం పలు చోట్ల భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.*

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 6*



జహీరాబాద్: భవానీ మందిరంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు



బొల్లారం: కేబీఆర్ కాలనీలో దుర్గామాతను దర్శించుకుంటున్న మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి



జిన్నారం: అన్నపూర్ణ దేవిగా..



రాయికోడ్: ముత్యాలవాడలో అన్నపూర్ణ దేవిగా ముమ్మాదేవిగా అమ్మవారు



మునిపల్లి: ఖమ్మంపల్లిలో లలితా త్రిపురసుందరిగా అమ్మవారు



రామచంద్రాపురం: పూజలు చేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్, బీఆర్‌ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి



నిజాంపేట్: భవానీమాత దీక్షాదారులతో జీఎమ్మార్ ఫౌండేషన్ చైర్మన్ గుబ్బపు మచ్చేందర్



ఝరాసంగం: అమ్మవారి పూజలో రూరల్ సీఐ హనుమంత్

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT SANGARDDY
I.A.No. 1527 OF 2018
IN
I.A.No. 287 OF 2018
IN
OS.No. 65 OF 2013
BETWEEN:
Smt. Baindla Akkamma
...Petitioner/Petitioner/Plaintiff
AND
Gaddameedi Narsimlu and others
...Respondents/Respondents/Defendants
To
Patlolla Veeranna, S/o. Siddi Ramappa, Aged about 60 Yrs., Occ: Retired VRO (LR of Respondent No. 6 Late P.Sharanamma), R/o. Maktha Allur Village of Kandi Mandal, Sangareddy District
...Proposed Respondent No. 9
NOTICE
To take notice that the Petitioner/Plaintiff filed a petition against the Respondents/Defendants and the same is posted to 18-10-2024 for your appearance (Proposed Respondent No. 9) before this Hon'ble Court at 10.30 A.M. by person or through counsel, failing which the matter will be decided against you.
// BY COURT ORDER //
T.SATHYANARAYANA, B.ARJUN,
Advocates-Sangareddy
Date: 05-10-2024, Place: Sangareddy.